



భారతదేశంలో హిమాలయ పర్వత ప్రాంత సాంద్రారణ్యంలో యీ నెల ఒకటి రెండు తారీఖుల్లో జరిగిన అఖిల భారత జంతుమహాసభకి, మానవప్రతినిధిగా వెళ్ళే అవకాశం లభించింది. సరిగ్గా మహాసభ ప్రారంభమయ్యే సమయానికే చేరుకున్నా. మహాసభ ఆహ్వానవర్గం అధ్యక్షులు మిస్టర్ శునకరాజ్ గారు నన్ను సగౌరవంగా ఆహ్వానించారు. క్షేమం అడిగారు. తమ ఆహ్వానాన్ని మన్నించి శ్రమ అనక ఇంత దూరం వచ్చినందుకు మహాసభతరఫున కృతజ్ఞతాభివందనాలు తెలియజేశారు. శునకరాజ్ గారు తెప్పించిన ఫలహారం సేవించి వేడి తేనీరు త్రాగాను. మార్గాయాసం కొంత ఉపశమించింది. అయిదు నిముషాలు గడచిన అనంతరం, శునకరాజ్ గారివెంట బయలుదేరాను. సభ అప్పుడే వివిధరాష్ట్ర, ప్రాంత, జంతు ప్రతినిధివర్గంతో, వివిధ రకాలజంతువుల్తో క్రిక్కిరిసిపోయింది. పెద్దపులులూ, మేకలూ, తోడేళ్లూ, గొర్రెలూ, కుక్కలూ, పిల్లులూ, ఎలుగుబంట్లూ, చిరుతపులులూ, సింహాలూ, ఏనుగులూ, కప్పలూ, పాములూ, ముంగిసలూ, ఎలుకలూ, ఒకటేమిటి! పరస్పరం బద్ధవైరం గల, అన్నిరకాల జంతువులూ, ఒకదాని ఒళ్లో మరొకటి అతి స్నేహపూర్వకంగా, సౌహార్ద్రభావంతో కూర్చున్నాయి. జంతువుల్లోవచ్చిన ఈ పరిణామానికీ, పరివర్తనకీ, నాలో నేనే అత్యాశ్చర్యం పొందాను. ఒకడి పొడంటే ఒకడికి గిట్టని, ఈ మానవులకంటె ఈ జంతువులే నయం అనిపించింది. శునకరాజ్ గారు తిన్నగా వెళ్లి ఖాళీగా ఉన్న ఒక కుర్చీ చూపించారు. నేను చిరునవ్వుతో, కూర్చున్నాను. వివిధప్రాంత జంతుప్రతినిధివర్గం కాబోలు, ఆయాజంతు సమూహాలకు ఎదురుగా ఉచితాసనాల్లో ఉపవిష్టులయ్యారు. సభామధ్యమున, ఉన్న పెద్ద వేదికపై, ఉన్న మూడు పెద్దకుర్చీల్లో మహాసభాధ్యక్షుడూ, కార్యదర్శి, ఉపన్యాసకుడూ, వరుసగా కూర్చున్నారు. అయిదునిముషాలు అంతా నిశ్శబ్దంగా వుంది. ఆనిశ్శబ్దంలో, జంతువుల గుసగుసలు అస్పష్టంగా వినపడుతున్నాయి. ఇంతలో గణగణమని పెద్ద గంట శబ్దం దశదిశలా, మార్మ్రోగింది. అనంతరం శ్రీయుత గార్దభశాస్త్రి గారి, జనగణమనగీతంతో మహాసభ కార్యక్రమం ఆరంభమయింది.

అంతట సభాధ్యక్షుణ్ణి మహాసభకు పరిచయంచేస్తూ మహాసభ కార్యదర్శి శ్రీయుత వ్యాఘ్రేశ్వరరావుగారిలా అన్నారు.

మహాజనులారా! వివిధప్రాంతీయజంతు ప్రతినిధులారా! మహోన్నతమైన ఆశయాలతో జంతుజాతి సర్వతోముఖాభివృద్ధి కోసం, జంతుకల్యాణమే ఆదర్శంగా విశ్వజంతుకోటి సత్వరాభివృద్ధికోసం కృషిచేసి, యీ మహాసభయొక్క ఆశయాన్ని సఫలంచేసి, మా ఆహ్వానాన్ని మన్నించి, విశ్వజంతు కల్యాణకారకమైన యీ మహాసభను జయప్రదంగా జరుపుటకు, తామందరూ యిచ్చుటకు, విచ్చేయుట నిజంగా అదృష్టం. పతనావస్థలో, బానిసత్వంలో, మానవజాతి ఇనుపపాదాలక్రింద, స్వేచ్ఛాస్వాతంత్ర్యాలులేక, తుణమొక గండంలా,

కంటినిండా నిద్రలేక, యీ భూలోకంలోనే నరకబాధలు అనుభవించే చిరకాల ప్రాప్తమైన యీ బానిసజీవితానికి ఇంతటితో స్వస్తి చెప్పి, విశ్వజంతుజాతి యావత్తూ, ఒకటై, నడుంకట్టి, మానవులనిరంకుశత్వాన్ని ప్రతిఘటించి, ఆఖరువిజయం వరకూ, వీరోచితంగా ప్రతిఘటించి, పోరాటం కావించవలసిన తరుణం ఆసన్నమైంది. కావున అఖిలభారత జంతు మహాసభను, విశ్వజంతుమహాసభకు అనుబంధసంస్థగా భారతదేశంలో యేర్పరచి, రానున్న విశ్వమానవకోటితో, యుద్ధానికి, భారతదేశంతరఫున అఖిలభారతజంతు మహాసభకూడా, విశ్వజంతు మహాసభతో కలసి పోరాడగలదు. ఈ పోరాటంలో మీరంతా మీ సర్వస్వాన్నీ ధారపోసి జంతుజాతి, మనుగడకోసం, జంతుజాతిఅభ్యుదయంకోసం, మీ, మీ ప్రాణాల నయినా సరే ధారపోస్తారన్న విశ్వాసం మాకుంది. మన మహాసభయొక్క లక్ష్యాలూ, కార్యక్రమం, మన మహాసభాధ్యక్షుడు శ్రీ మృగరాజ్ సింహాద్రిరావు గారు, మనవిచేస్తారు. మన మహాసభకోర్కెపై యీ సభకు అధ్యక్షుడుగా ఉండటానికి ప్రేమతో సమ్మతించిన, శ్రీ మృగరాజ్ సింహాద్రిరావు గారికి, మహాసభతరఫున నా కృతజ్ఞతాభివందనా లర్పిస్తూ ఇంతటితో ముగిస్తున్నాను. అని కార్యదర్శి వ్యాఘ్రేశ్వరరావు గారు బల్లయెక్కి గొంతుకగా కూర్చుని తోక ముడిచి నాలికజాపి ఒగర్చసాగారు. జంతువులన్నీ ఒక్కసారి కృతజ్ఞతాసూచకంగా ఆకాశాన్ని మిన్నుముట్టే హర్షధ్వానాలుచేశాయి. గాడిదలన్నీ ఓండ్రపెట్టాయి. గుర్రాలు సకిలించాయి. పెద్దపుల్లూ, సింహాలూ, సివంగులూ, గర్జించాయి. ఏనుగులు ఘీంకారాలు చేశాయి. పాములు బుసకొట్టాయి. మృగరాజ్ శ్రీ సింహాద్రిరావు గారు ఆసనంమీంచి లేచి నిలబడి గొంతుక సవరించుకుని చిన్న దగ్గు దగ్గారు. వాతావరణం అంతా మళ్లీ నిశ్శబ్దం ఆవరించింది.

మహాసభాధ్యక్షులు మృగరాజ్ గారు తమ ఉపన్యాసాన్ని ప్రారంభించారు. సభాసదులారా! వివిధప్రాంతీయ జంతు ప్రతినిధి సోదరుల్లారా! ఈ మహాసభకు నన్నే అధ్యక్షుడిగా ఎన్నుకుని నాయందు మీకుంటే ఆదరాభిమానాల్నీ, అపారగౌరవ మర్యాదల్నీ ప్రకటించినందుకు నేను మీకు ఏవిధంగా నా కృతజ్ఞత తెలియజెయ్యాలో గ్రాహ్యం కావడంలేదు. ఈనాడు మనం యావన్మందీ ఇక్కడ ఎందుకు సమావేశమయ్యాం? మన జంతుజాతి కష్టనిష్ఠురాలూ, మంచిచెడ్డలూ, సింహావలోకనం చేసుకుని, ప్రస్తుతం మనం క్రుగ్గి కృశించిపోయే యీ బానిసజీవితంనుండి విముక్తుల మవడంకోసం, ఇంతకాలంనుంచీ మానవజాతి ఇష్టా ఇష్టాలమీద, దయాధర్మాలమీద ఆధారపడి, నిరంకుశులైన మానవుల క్రింద అణిగి మణిగి సకల కష్టాలూ అనుభవిస్తూ, కడుపునిండా తిండీ, కంటినిండా కునుకూ ఎప్పుడే మానవుడిచేతుల్లో ఏంబాధలు పడవలసి వస్తుందో అన్న భయంతో క్షణక్షణం గండంతో అతిహేయమైనబానిస జీవితం గడిపాం. కాని ఇక ఆ రోజులు పోయాయి. విశ్వజంతుకోటి మేల్కొంది. యథార్థం గుర్తించింది. మానవులవల్ల తమకు జరిగే ఈ అన్యాయాన్ని సహించలేక తమ అసమ్మతిని ప్రకటించింది. మానవుల నిరంకుశత్వాన్ని తీవ్రంగా, యావచ్ఛక్తితోనూ ప్రతిఘటించడానికి నడుం కట్టింది. మానవులవల్ల యుగయుగాలుగా మనకు జరిగే అన్యాయం, మానవులు చిరకాలం నుండి, మనమీద, ఎంతగా నిరంకుశత్వంగా, దౌర్జన్యంగా, ప్రవర్తిస్తున్నదీ ఒక్కసారి సింహావలోకనం చేసుకోండి. అంతా ఒకటే అయిన మన జంతుజాతిని క్రూరమృగాలనీ సాధుమృగాలనీ విడదీసి, మనలో మనకు లేనిపోని విభేదాలు కల్పించి, విరోధాలు కల్పించి, మన అజ్ఞానాన్ని ఆధారంచేసుకొని, మన్ని విభజించి పాలించే యుక్తి నేర్చుకొన్నారు. ఈ మానవ రాచకీయవేత్తల యుక్తులకు మనం మోసపోయి, మనలో మనం వైరాలు పెంచుకొని, తలోకపేరూ పెట్టుకుని తలకొక దిక్కుగా విడిపోయాం. కనుకనే ఇంతకాలంనుంచీ మనమీద మానవులీ అధికారాలు చలాయించగలిగారు. తమకు పాలిచ్చి పోషించేవి గనక, ఆవూ, గేదే, మేకా, గొర్రె సోదరుల్ని, చేరదీసి ఇంత గడ్డిపడేస్తూ ఏదో పోషించేస్తున్నాం, అని, వాటికి సాధుమృగాలని పేరుపెట్టి వాటికొక ప్రత్యేకతా, గౌరవం కల్గించారు లోకం మెప్పుకోసం. పాలిచ్చినన్నాళ్లూ చక్కగా అనుభవించి ఒట్టిపోగానే కటికివాడికి, అమ్మేసే ఈమానవుల ప్రేమ ఎంత నికృష్టమైనదో, ఎంత సంకుచితమైనదో ఆలోచించండి.

తమని మొయ్యడానికీ, తమ సామాన్లు మొయ్యడానికీ పనికొస్తారు గనక, గుర్రం, గాడిదా, కంచరగాడిదా మొదలైన సోదరుల్ని చేరదీసి, ఇన్ని దాణాగింజలు పడేసి, వెట్టిచాకిరీ చేయించుకుంటూ ఉత్తమాశ్వాలు, గార్దభాలూ, అని పేర్లుపెట్టి



1 తులము టిన్నులలో అన్నిచోట్ల దొరకును.
శ్రీ అంబాళ్ అండు కంపెని,
తపాలు పెట్టె నెం. 3. మదరాసు.

ఉపయోగించుకుంటున్నారు. వాటికీ, శరీరంలో శక్తి సన్నగిల్లగానే తోళ్లసాయిబులకి మన సోదరుల్ని అమ్మేస్తున్నారు. మానవుల ప్రేమ ఎంత సంకుచితమైనదో చూడండి.

తమ ఇంట్లో దొంగలబాధనుండి తప్పించుకోటానికిగానూ, ఇన్ని గంజినీళ్లతో మన శునకసోదరుల్ని వశంచేసికొని, అతివిశ్వాసమైన సేవకుడు అని పేరుపెట్టి, అందంగా, ఆరోగ్యంగా, బలంగా ఉన్నన్నాళ్లూ, ఇంటి కాపలాకాయించుకుని శరీరంలో శక్తి సన్నగిల్లగానే ఇన్ని గంజినీళ్లయినా పొయ్యలేక, మునిసిపాల్టీ కుక్కల VAN లోకి నెట్టి విషపుగాలి ఒదిలి బ్రతికుండగానే మన శునకసోదరుల్ని చంపుతున్నారు. చూడండి! మానవుల స్వభావం.

ఇంట్లో ఎలుకలబాధనుండి రక్షించబడ్డానికి మన మార్జాల సోదరుల్ని చేరదీసి పిల్లిని చంపితే మహాపాపం అని, పిల్లుల్ని ఉపయోగించుకుంటున్నారు. అలాగే ఏనుగుల్ని, అనేకములైనవారికి అవసరమయ్యే ఇతరజంతువుల్ని కూడా ఉపయోగించుకుంటున్నారు. ఇంక వారికి ఏవిధంగానూ, అవసరంలేని పులుల్ని మా రాచజాతి సింహాల్ని, చిరుతపులుల్ని, ఎలుగుబంట్లనీ, తోడేళ్లనీ, సివంగుల్ని, తక్కిన అన్ని అరణ్యజంతుజాతినీ, క్రూరమృగాలని చెప్పి, వారికి మనం ఏ అపకారం చెయ్యకపోయినా వేటాడి వధిస్తున్నారు. మానవజాతికి ఏమీ అపకారం చెయ్యకపోయినా, వాళ్లు విసర్జించిన, మలమూత్రాలు శుభ్రంచేసి, పెంటకుప్పలూ, పాకీదొడ్లూ బాగుచేసి, తనమార్గాన తాను మానవజాతికి నిస్వార్థ సేవ చేసే మనసూకరసోదరులను, చూస్తేనే చాలు. మానవరాక్షసులు, పంది! పంది! ఛ! ఛ అని అసహ్యించుకుంటూ తరుముతున్నారు. మన సూకరసోదరులయెడ కనీసం సానుభూతి అయినా లేక, పైగా అసహ్యించుకునే సభ్యతలేని మానవజాతిని ఏం చేస్తే పాపం ఉంది?

"తిరగబడాలి" విశ్వజంతుజాతి ఏకం కావాలి! విప్లవం వర్ధిల్లాలి!" కేకలు మిన్నుముట్టినాయ్.

కాస్సేపు ఆగి మళ్లీ మృగరాజ్ గారు ప్రారంభించారు. ఇంక కొంచెం బలపరాక్రమాలు కలిగి, పౌరుషం ఉన్న మా మృగరాజజ్ఞాతిని, ఎప్పటికయినా మావల్ల తమ నిరంకుశత్వానికి ప్రమాదం రాగలదని భయపడి, మాకు క్రూరమృగాలని పేర్లు పెట్టి "దుష్టసంహారం" అన్న పేరుతో, మాసింహాల్ని, పులుల్ని సివంగుల్ని, చిరుతల్ని, ఎలుగుగొడ్లనీ, వాళ్లజోలికి మేము వేటాడి చంపుతున్నారు. కాబట్టి, విశ్వజంతుజాతి ఈ మోసంగ్రహించి, ఇప్పటికయినా తమ కర్తవ్యం గుర్తించాలి. మానవుల నిరంకుశత్వానికి స్వస్తిచెప్పాలి. విశ్వజంతుజాతి అంతా ఒకటే, మానవులు పెట్టిన చీలికలూ పన్నిన పన్నాగాలూ, తప్ప మనలో మనకు ఎప్పుడూ నిజంగా విరోధాలు లేవు. కాబట్టి మనం ఇంతటితో నయినా పరస్పర విభేదాలకు స్వస్తి చెప్పి ఐకమత్యంతో, మెలగవలసిన సమయం ఆసన్నమైంది. మనలో మనకు ఐకమత్యం లేకనే ఇంతకాలంగా మనం మానవుల దౌర్జన్యానికీ, నిరంకుశత్వానికీ గురి కావలసి వచ్చింది. మనలోనే ఐకమత్యం ఉంటే మానవులు మనకేసి తేరిపారజూడలేరు. కాబట్టి జంతుజాతి యావత్తూ, ఎక్కడున్నా సరే, వర్గవిభేదాలు, విడిచిపెట్టి అన్నివిధాలా ఆందోళన చెయ్యాలి. ముందుగా శాసనోల్లంఘనం, పిమ్మట సత్యాగ్రహం, అప్పుడుకూడా ఫలితం కనబడకపోయిన, సాయుధవిప్లవం లేవతియ్యాలి. ఆవులు, గేదెలు, కుక్కలు, మేకలు, గొర్రెలు మొదలైనవన్నీ వెంటనే పాలివ్వడం మానాలి. ఎద్లుభూమిదున్నటం, గుర్రాలు బండ్లులాగటం, గార్దభసోదరులు బరువులు మొయ్యడం మాని సత్యాగ్రహం

(28-వ పేజీ చూడుడు)



ఎదిగే పిల్లల

సంక్షేమానికి అతి ప్రధానం

పిల్లలు చురుకుగా, పుష్టికరంగా ఎదుగుటకు విటోఫెర్రిన్ సాటిలేని సాధనం రక్తక్షీణత, విటమిన్ లోపం, అన్ని రకాల నీరసాళ్లతో బాధపడు వారికి ఇది మంచి టానిక్ గా పనిచేస్తుంది.

విటోఫెర్రిన్

ఉత్పత్తిదారులు :
ది మైసూర్ ఇండస్ట్రియల్ & టెస ్టింగ్ లాబరేటరీ లిద్.
మల్లేశ్వరం, బెంగుళూరు.

సెల్లింగ్ ఏజెంట్లు :
బెస్ట్ అండ్ కంపెనీ లిమిటెడ్.
పోస్ట్ బాక్స్ నం 63, మద్రాసు

BZ-36. TG

# అఖిలభారత జంతుమహాసభ

(22-వ పేజీ తరువాయి)

చెయ్యాలి. అవసరమైతే ఆహారం మాని ప్రాయోపవేశం చెయ్యాలి. శునకసోదరులు గంజిత్రాగడంమాని, తమ అసమ్మతిని తెలియజెయ్యాలి. మార్జాల సోదరులు, యజమానుల విస్తళ్లదగ్గర చెదిరిపడ్డ మజ్జిగ మెతుకుల కాశించక, ప్రాయోపవేశం ద్వారా తమతమ అసమ్మతిని తెలియజెయ్యాలి. మత్తేభములన్నీ అంబారీలు మొయ్యడం మానాలి. ఇంక అరణ్యప్రాంతాల్లో నివసించే మా మృగజాతి, శూరజాతి మృగాలన్నీ, మాతృభూమిని రక్షించుకునే నిమిత్తం మన అరణ్యప్రాంతాల్లో అడుగుపెట్టిన ప్రతిమానవుణ్ణీ, అరణ్యప్రాంతాల్లో జంతువులను వేటాడే నిమిత్తం వచ్చిన ప్రతిమానవుణ్ణీ జంతుజాతికి, మహాద్రోహిగా పరిగణించి, వచ్చినవాడు తిరిగివెళ్లకుండా హతమార్చాలి, ఒకటేమిటి మనకి చాతనైన అన్నివిధాలా, మానవజాతిమీద తిరుగుబాటు చెయ్యాలి. ఈ జంతుజాతి, స్వాతంత్ర్య పోరాటంలో, మనకి విజయం తథ్యం. విజయం మనది! మనం బానిసత్వంనుండి బయటపడే అవకాశంబహు సమీపంలోనే ఉంది. కాబట్టి వచ్చిన ఆ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకోనవలసిన బాధ్యత మీ మీ భుజస్కంధములపై ఉన్నది. కావున, వివిధ రాష్ట్రీయ, ప్రాంతీయ, జంతుప్రతినిధివర్గం యావన్మందీ మా ఉపన్యాససారాన్ని శ్రద్ధగా ఆలకించి, పార్టీ నియమావళికి కట్టుబడి, వెంటనే ఆయా ప్రాంతాల్లో, రాష్ట్రాల్లో నిర్మాణాత్మక మయిన కార్యక్రమం, ప్రారంభిస్తారని ఆసిస్తున్నాను. మీలో మీరు పూర్వంలాగే, జాతి భేదాలతో వర్గభేదాలతో, పరస్పరవిరోధాలతో, ముఠాలుగా ఏర్పడి మీ నైజం విడిచిపెట్టక పరస్పరం, మనోవైరుధ్యాలతో ఉన్నట్టు మేం కర్ణాకర్ణిగా విన్నాం. ఇదే నిజమైతే ఇంతకన్నా, సిగ్గుచేటూ నగుబాటూ మరొకటి ఉండదు. మనలో మనకి ఎప్పుడయితే అభిప్రాయభేదాలు ఏర్పడ్డాయో, అప్పుడే మానవులకు మనం లోకువ. అందువల్ల, గతం విస్మరించి, మీరంతా ఐకమత్యంతో వెంటనే కార్యరంగంలోకి దూకుతారని విశ్వసిస్తున్నా, అని మృగరాజ్ శ్రీ సింహాద్రిరావు గారు తమ ఉపన్యాససారాంశాన్ని ముగించి వేదికమీదగొంతుకగా కూర్చుని గంభీరంగా సభ ఒక్కసారి కలయజూశారు.

జంతువులన్నీ ఒక్కసారి మిన్నుముట్టేలా సకిలించి, అరిచి, ఓండ్రపెట్టి తమ హర్షాన్ని ప్రకటించేయి. పిమ్మట ఆహ్వానసంఘ కార్యదర్శి, శ్రీ శునకరాజ్ గారు వేదికమీదకు ఎక్కి ఇలా మాట్లాడారు.

ఈ మహాసభలో ఇప్పుడు మనం తీర్మానించిన తీర్మానసారాంశం మానవులకి ఈమానవప్రతినిధి, శ్రీ శ్రీ రావ్ గారి ద్వారా ఒక కాపీపంపి మన అసమ్మతిని ప్రథమంగా, తెలియజెయ్యాలి. పరస్పర ప్రతిపక్షానికి చెందినవారైనా, ఏసంబంధమూ లేని నిష్పాక్షిక పత్రికావిలేకరి గనుక, మన ఆహ్వానాన్ని మన్నించి యీ సభకు విచ్చేసినందుకు శ్రీ రావ్ గారికి మీ అందరి తరఫునా కృతజ్ఞతాసూచకవందనా లర్పిస్తున్నాను— అన్నారు శునకరాజ్ గారు—నేను చిరునవ్వుతో సభావేదికిపైకెక్కాను. అధ్యక్షుడు మృగరాజ్ గారితోనూ, కార్యదర్శి, వ్యాఘ్రేశ్వరరావు గారితోనూ కరచాలనం చేశాను- వారి సరసనే పిమ్మట కూర్చున్నాను— సభఅంతా మౌనముద్ర వహించారు.

అందరూ ఒక్క అయిదు నిముషాలు కళ్లు మూసుకుని మహాసభలక్ష్యాన్ని దిగ్విజయం చేయమని కోరుతూ, జంతుజాతి దైవమైన శ్రీ హయగ్రీవుణ్ణి ప్రార్థించాలని సభాధ్యక్షులు కోరుతున్నారు అన్నారు శ్రీ శునకరాజ్ గారు.

అయిదు నిముషాలు సభంతా నిశ్శబ్దం ఆవరించింది. అనంతరం, గార్దభశాస్త్రిగారు తమ కమ్మని కంఠంతో మంగళగీతం, "జంతుజాతి అభ్యుదయ, నవయుగోదయం మంగళంబు జంతుజాతికి, మహినీ, మంగళం" అంటూ పాడారు. గార్దభశాస్త్రి గారి మంగళగీతంతో, ఆనాటికి సభాకార్యక్రమం ముగిసింది — పిమ్మట కార్యదర్శి శునకరాజ్, వేదిమీదకు ఎక్కి గట్టిగా సకిలిస్తూ ఉద్బోధిస్తూ అన్నారు. సోదరులారా! అఖిలభారత ద్వితీయ జంతుమహాసభ జూలైనెలలో తిరిగి, నైమిశారణ్యంలో జరుగుతుంది. ఆ సభలో, యీలోపుగా మనపార్టీచేసిన కృషి సమీక్షించబడుతుంది. కాబట్టి అందరకూ యథారీతిన ముందుగానే ఆహ్వానాలు పంపబడతాయి. అయినాముందుగా హెచ్చరించడం ధర్మంకనుక హెచ్చరించాం. జంతువు లన్నీ అవునన్నట్టుగా హర్షధ్వానాలు చేసి అరిచాయి. అంతటితో ఆనాటి కార్యక్రమం ముగిసింది.

★


శ్రీమద్భగవద్గీత

వ్యాఖ్యాత: శ్రీ కాశీనాథుని నాగేశ్వరరావు

ఆరవ ముద్రణము : వెల రూ-4-0-0

(ప్యాకింగు, పోస్టేజి రూ 0-9-0)

ఆంధ్రగ్రంథమాల.



SPLENDID SELECTION
MADE IN FAMOUS SWISS FACTORIES
EACH GTD. FIVE YEARS

NO. 81



Size 7¼"
5 JEWELS CHROME 30/- ROLLED GOLD 33/-
7 JEWELS CHROME 35/- SUPERIOR 38/-
15 JEWELS " 44/- ROLLED GOLD 48/-

NO. 82



Size 7¼"
5 JEWELS CHROME 28/- ROLLED GOLD 33/-
7 JEWELS CHRME 33/- SUPERIOR 35/-
15 JEWELS " 42/- ROLLED GOLD 45/-

NO. 83



Size 12"
FULLY JEWELLED 19/- SUPERIOR 21/-
WITH RADIUM 21/- CENTRE SECOND 23/-
SPECIAL HIGH CLASS MACHINE 27/-

NO. 84



Size 8¼"
5 JEWELS CHROME 26/- ROLLED GOLD 32/-
7 JEWELS CHROME 32/- ROLLED GOLD 36/-
15 JEWELS " 48/- RILLED GOLD 58/-

NO. 85



Size 6¾"
5 JEWELS CHROME 22/- SUPERIOR 25/-
5 " ROLLED GOLD 30/- SUPIRIOR 33/-
15 " CHROME - 45/- ROLLED GOLD 55/-
TIME PIECE - 20/- SUPERIOR 25/-
POCKET WATCH 12/- SUPERIOR 15/-
Postage extra Free on order for two

H. DAVID & CO.
POST BOX NO 11424 CALCUTTA